మైనవాళ్ళచేత అంటే రంభ, ఊర్వశి, ఇత్యాదులుచేత అనగా అటువంటి వాళ్ళచేత ఎడతెగకుండా చూడబడితిమా Murder" అన్నాడు కాంతారావు.

తోడివిద్యార్థి అన్నాడు. "నీవు Murder అంటే జ్ఞాపకం వచ్చింది. Behind every murder there will be a woman." కాంతారావు "Amend! before every murder! అలా చూస్తూ ఉంటుంది. ఇలా చస్తూ ఉంటాను. మగాడేచూశాడనడమేమిటి?" అని పూర్వపు సంగతి స్ఫురణకువచ్చి అగ్గి అయిపొయ్యేడు. మనకెందు కావెధవగొడవ.

.... .... .... .... ....

# 'రొమాన్సు' పెళ్లి!

మెడికల్‌కాలేజీ చమక్. టిప్‌టోగా యువకులు యువతులుకూడి కళాశాలా విద్యాభ్యాసం చేయడం, ఎక్సుఛేంజి ఆఫ్ వ్యూస్ వూయింగ్స్,—అందులో ఎప్పుడైనా ఓ సాయంకాలం ఓపడుచు ఓ యీడూ జోడూ సహాధ్యాయుణ్ణి టీకి తనగదికి పిలవడం, లేకపోతే ఏక్సిడెంటల్‌గా షాపింగు ఆ సందర్భంలో "హల్లో" యని రికగ్నైజు చేసుకొంటూ తమకు తెలియకుండా యెవరి గదిలోకో వాకరిగదిలోకి చేరుకోవడం,—

అట్టిమాదిరి చనువూ మనువూ కలిసివచ్చే సమాగమం గలవారై ఓముని మాపువేళ ఎలెక్ట్రిక్ దీపాలముందు, చిన్న మేజాబల్లమీద స్టైతస్కోపులు రెండుపడి మొత్తలుకొట్టుకొంటూ వుంటే గమనించకుండా, వసారాషెడ్డులో రెండు పేపకుర్చీల

మీద కూర్చుని, కుమారి మధురమాణిక్యం, కుమార విధు శీతలుడు మాట్లాడుకుంటూ వున్నారు.

లోలోపలి యూహలేవో అణచుకొని ప్రసంగించుకొందామని వారి సంకల్పం: అణచుకుందామని అనుకొన్నకొద్దీ కంగు కంగు కంఠధ్వనులు అవకాశం అంతా ఆవరించుకు పోవడం ఫలితం.

మధురమాణిక్యం: మనపెళ్ళి ఎంత అనుకోనిదిగా, ఎంత—expression తోచకుండావుంది—ఎంతమైమఱపు గొలిపేదిగా—అదే romantic గా ఉండాలీ యంటే—దుష్యంతుడూ శకుంతలా పెళ్ళిలాగుండాలి.

విధుశీతలుడు: నీ కలాంటిపెళ్ళి యిష్టమే?

మధుర: ఏం? అందులో తప్పేముంది? గాంధర్వ వివాహం!

విధుశీ: నీవో ఆశ్రమంలోయుండడం, నీళ్లుమోయడం, అక్కడకు నేను వేటాడ్డానికి రావడం, నీవు ముళ్ళతీగ త్రొక్కకోవడం—అదంతా నీ కిష్టమే?

మధుర: అదెప్పుడూ నాకిష్టంలేదు. మొక్కలకు నీళ్ళు పోయమనేదానంత పాడుపని అదేకాని మఱొక్కటిలేదు. మఱినీ వేటనుమించే హింసలేదు. అందుమీద ముళ్ళతీగ పెనచుకొని అడుగువేయడం యనే దానంత ఆపత్తు వేఱొకటియుండబోదు—మా కిల్లులేదోయి? క్రిందటి సెలవులుకి చూచేయుంటావు. బ్రహ్మాండమయిన mansion. చుట్టూ తోట, యెక్కడచూచినా కుళాయిలు, ఓ మాత్రపు ప్రహరీగోడ!—గోడపక్క లోతట్టుగా గులాబిరేకులు వెదజల్లేస్తాను ఒత్తుగా. ఓ వెన్నెలరాత్రి నీవు

హుషారీగా ఈలేసుకొంటూ హర్డిల్సు గెంతినట్టు ఆ గోడగెంతి సరిగ్గా నా భుజపంజరంలో ఉండొచ్చు. మనమేం ఎఱుగని వాళ్ళమా యీ వఱకు ? దుష్యంతుడికీ శకుంతలకీ ఉన్నంత సిగ్గు అక్కఱలేదోయి. తిన్నగా వచ్చెయి.

విధుశీ : నన్ను పట్టుకోగలవో పట్టుకోలేవో ?

మధుర : అందుకేగా గులాబిరేకులు వెదజల్లేది.

విధుశీ : ఫస్టు ఎయిడ్ అవసరంలేని గాంధర్వం కావా లన్నమాట.

మధుర : (సన్నగా) ఊఁ.

విధుశీ : ఘట్టిగా ఊఁ అనడంలేదు. మళ్ళీ ఆలో చిస్తున్నావు ?

మధుర : శకుంతలా దుష్యంతుల మోస్తరిపెళ్ళి అంటే ఓచిక్కు కనిపిస్తోందోయి. వాళ్ళకోపిల్లా డుట్టాడనుకొంటాను.

విధుశీ : వాణ్ణి వెంటవేసుకుపోతేనే తనింటికి రావద్ద న్నాడు మొగుడు.

మధుర : కాబట్టి నీవు గోడదాటి వచ్చేముందే కొన్ని కొన్ని పరికరాలతోటికూడా రావాలి.

విధుశీ : You mean contraceptives ?

మధుర : కాదుమతీ! దుష్యంతుడు బాణాలు గీణాలు వేసికొని వెళ్ళకుండా, సంతాన నిరోధ సాధనసామగ్రి వేసుకు పోయివుంటే శకుంతలకి పిల్లడుపుట్టక పోయియుండేది. ఆ trouble యంతా అందునించి వచ్చిందని నా నమ్మకం.

విధుశీ : నిజమే. పెద్ద రొమాంటిక్‌లేడీ శకుంతల యని అంటారు. అయినప్పటికి రొమాన్సు యంతా మఱచిపోయి, పిల్ల

పుడితే, ఆపిల్ల మగపిల్లడైతే, మగపిల్లడికి రాజ్యం, మళ్ళీ ఎవ్వళ్ళతోనూ పంచుకోనటువంటి రాజ్యం కావాలనడం, ఈ prosaic notions ఆ సమయంలో శకుంతలకి కలిగాయీ యంటే నాకు నమ్మశక్యంగాలేదు సుమా! శకుంతలది romantic love కాకపోయి యుండాలి. లేదా కాళిదాసు రసాభాసం చేసి ఉండాలి.—వింటున్నావా నన్ను?

మధుర: వినకేంగాని—ఈ డిస్కషన్ యిప్పుడే పెళ్ళి రొమాన్సును చాలామట్టుకు పాడుచేసిందోయి. దుష్యంతుడీ శకుంతలాకంటె better instance లేదు మరోటి?

విధుశీ: Thousands and tens of thousands! వేలు లక్షలు: For instance take that fellow ప్రవర.

మధుర: You mean మాయాప్రవర?

విధుశీ: వాడే! యువకుల కభిమానమిత్రుడు!

మధుర: అప్పుడు నీకు counterfeit- శరీరమంతా నీలాగుండి, మనస్సుమాత్రం నీ మనస్సులాంటిది కానివాడు మరొకడుండొద్దూ?

విధుశీ: నేనే ఓమాటు వద్దని, ఓమాటు నేనే కద్దంటే సరిపోదూ?

మధుర: అసలు వాళ్ళది పెళ్లేకాదేమో?

విధుశీ: But romance of the highest order అనుకుంటా,

మధుర: Romance of the highest ఆర్డరే చాలదు. పెళ్ళి కూడా కావాలి.

విధుశీ: ఉషాకన్యనుగురించి యోజించుపోనీ.

మధుర: ఆ కన్యను తల్చుకొన్నప్పుడల్లా నాకు దోమ తెర, పందిరిపట్టెమంచం, గలీబుపరుపు, లోడ్డు, అత్తరుదాన్,

పన్నీరుబుడ్డి, ప్రియుణ్ణి అక్కడకు పిలిపించుకోవడం—మొద్దు గర్భాదానంలాగూరుకుంటుంది ఎంచేతో ?

విధుశీ : కాని తరువాత మహాయుద్ధం అయింది. అనిరుద్ధుఁడు గొప్పవీరు డనిపించుకున్నాడు. ఉషాకన్య యందఱి హృదయకుహరాల్లోనూ వెలిసిపోయింది.

మధుర : ఉషాకన్యతండ్రి రాక్షసు డనుకుంటాను. దైత్యునికూతురికి రొమాన్సు ఏమిటి ?

విధుశీ : మీతండ్రి మంచివాడేగా ?

మధుర : అదే ఆలోచిస్తున్నాను. ఈ మనపెళ్ళికి వొప్పుకొంటాడో వప్పుకోడో ?

విధుశీ : అయితే ఓపనిచేదాం.

మధుర : ఏమిటది ?

విధుశీ : నేనో మందుత్రాగే రోగిగా ఉంటాను. నీవు నాకు వైద్యంచేసే దానివిగావుండు.

మధుర : నేనే రోగిగాయుంటాను. నీవే నాకు డాక్టరివిగావుండు.

విధుశీ : ఎందుచేత ?

మధుర : నీవు రోగివికావడం నాకు ఇష్టంలేదు.

విధుశీ : నీవు రోగివికావడం నాకు అంతకన్నా ఇష్టం లేదు.

మధుర : Alas ! నిత్యజీవనాన్ని విడిచిపెట్టి రొమాన్సు ఆలోచించడానికే పోసిబిలిటీ లేదనుకుంటానోయి ! విధుశీతలా !

విధుశీ : అంటే ?

మధుర : రొమాన్సుకు ముందో వెనకో రోగం, రొచ్చు, పిల్లామేకా, ఇల్లూవాకిలీ, ఇదంతా ఉండితీరుతుందేమోనని భయ మేస్తోందోయి ! నాకు.

విధుశీ : Soul force వుంటే అల్లాంటి భయమే వుండదు.

మధుర : అదెలాంటిదో ?

విధుశీ : Soul ! నీ వెప్పుడూ జీవాత్మనుగుఱించి థింక్ చేయలేదన్నమాట.

మధుర : Think ఏం ? తపస్సేచేశాను.

విధుశీ : అయితే చెప్పు దాని romance.

మధుర : సావిత్రికధలే ? సావిత్రి, సత్యవంతుడు, యముడు, దున్నపోతు.

విధుశీ : తిరిగి పురాణగాధల్లోకి పోతున్నావు. rigmarole !

మధుర : మఱి నేను చనిపోతేనేగాని realistic present day నా Soul యొక్క romance నాకు తెలియదాయె ?

విధుశీ : నీవు చనిపోవడమే ? చనిపోవడమే ?— పాపము శమించుగాక-హతోస్మి హతోస్మి- [అని మూర్ఛిల్లును]

మధుర : ( గుండెరొాద కొొలగొట్టంతెచ్చి, పెట్టి, వింటూ) హా ! హా ! హా ! విధుశీతలా ! విధుశీతలా ! పలుకవేం ! హత విధీ ! ఎంతపని చేసితివి ? విధుశీతలా ! పలుకరించినా పలుకవేం? నేను జీవించియున్నాను. నేను ప్రాణముతో నున్నాను. ఇటు చూడు. లేలే. నాకు భయమువేయుచున్నది !

విధుశీ : ( కళ్లుతెఱచి ) ఎందుకు భయం ?

మధుర : ఎంచేతనోబాబూ ! నన్నొక్కసారి బిగియార కావలించుకో ! నన్నొక్కసారి తనివార ముద్దుపెట్టుకో ! నన్ను వెంటనే పెళ్ళాడు.

విధుశీ : ( మొదటి రెండూచేసి ) పెళ్ళాడ్డానికీరొమాన్సు చాలునా ?

మధుర : ఎక్కువ! ఈమాటు నిజంగా మృత్యుదేవత వచ్చినా జయించి పాఱవెయ్యగలనన్నమాట.

విధుశీ : తథాస్తు.

.... .... .... .... ....

## సిగరెట్ పడిపోయింది !

బెజవాడ వద్దకు బిట్రగుంటనుంచి వచ్చే ప్యాసింజరు వచ్చి ఒకగంట ఆగుతుంది. కాని జనం ఆ బండివచ్చి వేళకాక గంట ముందుగాను వస్తారు. ఒకగంట అయ్యాక వస్తారు. అంతచేటు " ఇర్రెగ్యులర్ " అది సర్వసాధారణంగా అన్నిరైళ్లు అంతే అనుకోండి ! వాటియొక్క నడక శీతోష్ణస్థితిని మారేటట్లు కనబడుతుంది, రైల్వేగైడ్‌లో ఏ టైము ఇచ్చినా ?

అందరలోనూ ముందుగా వస్తారు రెండవ తరగతి గాడీ ఎక్కేవాళ్ళు ! ఎంచేతా అంటే ఆ తరగతి బండి ఒకటే తగిలిస్తారు ఆ ప్రయాణికి. అందులోనే ఇరుక్కు ఇరుక్కు కూర్చోవాలి ! అందువల్ల ప్రయాణీకులు గంట గంటన్నరముందుగానే వచ్చి ఆలా బండిలో పరుపులబల్ల అంతా వ్యాపించుకొని మరొకళ్ళు ఎక్కకుండా తామే కూర్చుంటారు. సాగనంపడానికి వచ్చిన వాళ్ళుకూడా చివరకంట ఆ బల్లమీద ప్రయాణీకుల్లా కూర్చుండి కూర్చుండి చివరకుగాని దిగరు. ఇది నిత్యము చూచే సంఘటనే కాని ఆ ప్రొద్దుగన్నాది మరీ విడ్డూరమైంది ! ఎందుకు చదువుతారుగా పాఠకులు నేనడం ఎందుకు విడ్డూరమని ?